www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 29 ఆగస్టు 2024
5
తిరుపతి

తెలుగు వెలుగు 'గిడుగు'

ప్రజాశక్తి - బిఎన్ కండ్రిగ

తెలుగు వ్యవహారిక భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం బి.ఎన్.కండ్రిగ మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో 'గిడుగు' అక్షర ఆకతిలో విద్యార్థులు కూర్చుని తెలుగు భాషపై మమకారాన్ని చాటుకున్నారు. తెలుగు భాషను కాపాడుకోవాలని ఉపాధ్యాయులు ఉపన్యసించారు.

'డ్వామా'లో హై'డ్రామా'..!

- ఉపాధి హామీ ఏపీవో చిరునామా ఎక్కడ?
- తిరుపతి డ్వామా పీడీ సిసిగా చలామణి
- ఉద్యోగం నిండ్రలో..విధులు తిరుపతిలో..
- జీతాలు చెల్లించిన చిత్తూరు అధికారులు

ప్రజాశక్తి -రామచంద్రాపురం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీవోగా పనిచేస్తున్న చంద్రశేఖర్ రాజు నీ చిరునామా ఎక్కడ? అంటూ ఉపాధి కూలీలు వెతుకుతున్నారు. రెండేళ్ల క్రితం జిల్లాల విభజన అనంతరం చంద్రశేఖర్ రాజును చిత్తూరు జిల్లా నిండ్ర మండలం ఏపీవోగా అప్పటి జిల్లా కలెక్టర్ బదిలీ చేశారు. కానీ ఏపీవో చంద్రశేఖర్ రాజు వైసిపి ప్రభుత్వంలోని ఓ మంత్రి అండదండలతో నిండ్ర నుండి డిప్యూటేషన్ పై తిరుపతి సిఎల్ఆర్సి కోర్స్ డైరెక్టర్ గా తిరుపతి జిల్లాకు కొంత కాలం పాటు విధులు నిర్వహించేలా సి ఆర్ డి ఆదేశాలు వచ్చాయి. అయితే తిరుపతి డ్వామా కార్యాలయంలో కోర్స్ డైరెక్టర్ విధులు నిర్వహించకుండా అనధికారికంగా తిరుపతి డ్వామా పథక సంచాలకులకు సిసిగా వ్యవహరిస్తున్నాడు. నిండ్ర మండలానికి ఏపీవో లేకపోవడంతో విజయపురం మండలం ఏపీవో భవితకు ఇన్‌ఛార్జి బాధ్యతలను చిత్తూరు పిడి అప్పజెప్పారు. అయితే కోర్స్ డైరెక్టర్ గా డిప్యుటేషన్ కాలం పూర్తయినప్పటికీ, గత రెండేళ్లుగా అనధికారికంగా తిరుపతి డ్వామా కార్యాలయంలో పనిచేస్తున్న ఏపీఓ చంద్రశేఖర్ రాజుకు తిరుపతి డ్వామా పిడి శ్రీనివాస ప్రసాద్ సిఫార్సు మేరకు.. గత నిండ్ర ఎంపీడీవో డ్యూటీ సర్టిఫికెట్ ఇస్తే..... చిత్తూరు డ్వామా అధికారులు జీతాలు మంజూరు చేసేవారు. ఏపీవో చంద్రశేఖర్ రాజు తిరుపతి డ్వామా పిడి కుటుంబ సభ్యులకు దగ్గర బంధువు కావడం, వైసిపి ప్రభుత్వం లోని మంత్రి ఆశీస్సులతో ఈ వ్యవహారం రెండేళ్లుగా సాగుతోంది. ఇంత జరుగుతున్నా జిల్లా కలెక్టర్లు ఎందుకు పట్టించుకోలేదని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. ఎపిఓ చంద్రశేఖర్‌రాజు ఉపాధి సిబ్బందిని బెదిరించి ఇబ్బందులు పెట్టేవారన్న విమర్శలు లెక్కలేనన్ని ఉన్నాయి.

ఉపాధి హామీలోని కొంతమంది అధికారుల విశ్వసనీయ సమాచారం మేరకు... చిత్తూరు జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నాలుగు అసిస్టెంట్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ పోస్టుల కొరత ఉంది. ఐనా తిరుపతి జిల్లా పథక సంచాలకులు శ్రీనివాస్ ప్రసాద్ ఏపీవో చంద్రశేఖర రాజు సేవలు అవసరమని తిరుపతి జిల్లాకు బదిలీ చేయాలని చిత్తూరు డ్వామా పథక సంచాలకులకు లేఖను పంపారట. దీంతో చిత్తూరు డ్వామా అధికారులు ఆ ఏపీఓను తిరుపతి జిల్లాకు బదిలీ చేయడం కుదరదని జిల్లా కలెక్టర్ కు నివేదిక ఇచ్చారట.. ఏపీవో చంద్రశేఖర్ రాజును తిరిగి చిత్తూరు జిల్లాలో ఏపీవో విధులకు హాజరు కావాలని చిత్తూరు డ్వామా అధికారులు ఆదేశించినప్పటికీ తిరుపతిలోని పిడిసిసిగా చలామణి అవుతూ క్షేత్రస్థాయిలో పథక సంచాలకులతో పాటు ఉపాధి హామీ పనుల తనిఖీ విధులు నిర్వహిస్తున్నారు. దీంతో గత రెండు నెలలుగా చిత్తూరు డ్వామా అధికారులు ఏపీవో చంద్రశేఖర్ రాజు నిండ్రలో విధులు నిర్వహించడం లేదని జీతభత్యాలు కూడా నిలుపుదల చేశారు. అయినా ఆ ఏపిఓ తిరుపతి జిల్లాలో ఉపాధి సిబ్బంది నుండి డబ్బుల కలెక్షన్ చేయడం చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. రెండేళ్ల పాటు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా విధులు నిర్వహిస్తున్న ఏపీవో చంద్రశేఖర్ రాజుకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల నుంచి ఎలా జీతాలు చెల్లిస్తారన్నది ప్రధానమైన ప్రశ్న.....? రెండేళ్లు గా ఇంత జరుగుతున్నప్పటికీ రాష్ట్రస్థాయి . సిఆర్డీ అధికారులు, జిల్లాస్థాయిలోని కలెక్టర్లు ఎందుకు పట్టించుకోలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఏపీవో చంద్రశేఖర్ రాజు, డ్యూటీ సర్టిఫికేట్ ఇచ్చిన అప్పటి ఎంపీడీవో పై చర్యలు తీసుకుని, ఉపాధి హామీ విధుల నుండి చెల్లించిన జీతభత్యాలను సంబంధిత అధికారుల నుంచి రికవరీ చేసి ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ 'డ్యూటీ డ్రామా' వ్యవహారంలో పాల్గొన్న వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఏపీవోపై చర్యలు తీసుకుంటాం : పీడీ రాజశేఖర్, చిత్తూరు జిల్లా

ఏపీవో చంద్రశేఖర్ రాజు వ్యవహారంపై చిత్తూరు డ్వామా పిడి రాజశేఖర్‌ను వివరణ కోరగా చిత్తూరు జిల్లాలో ఏపీవోగా విధులు నిర్వర్తించకుండా..... తిరుపతిలో అనధికారికంగా విధులు నిర్వహిస్తున్నది వాస్తవం. ఏపీవో చంద్రశేఖర్ రాజు పై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

వేమన విజ్ఞాన కేంద్రంలో నివాళి అర్పిస్తున్న వామపక్షాల నేతలు

ఆగని విద్యుత్ బాదుడు

బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరులకు నివాళి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

కరెంట్ ఛార్జీలు తగ్గించాలని 24ఏళ్ల క్రితం పది వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రంలో విద్యుత్ మహోద్యమం ఉవ్వెత్తున సాగింది. ఈ ఉద్యమంలో హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో టిడిపి ప్రభుత్వం ఉద్యమకారులపై పాశవికంగా కాల్పులు జరిపి రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామిలను బలిగొంది. ఈ నేపథ్యంలో తిరుపతి యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో విద్యుత్ అమరవీరులకు సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఈ సభకు సిపిఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం అధ్యక్షత వహించారు. సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు వందవాసి నాగరాజు, పి.మురళి మాట్లాడుతూ అప్పట్లో జరిగిన విద్యుత్ మహోద్యమం వల్ల ప్రపంచబ్యాంక్ సంస్కరణల వేగం తాత్కాలికంగా తగ్గిందన్నారు. అయితే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చాపకింద నీరులా విద్యుత్ సంస్కరణల పేరుతో భారాలు మోపుతుందన్నారు. విద్యుత్ కార్పొరేట్ల చేతిలో బందీ అయ్యిందన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి కేంద్రం షరతులకు తలొగ్గి దొడ్డిదారిన 32వేల కోట్ల రూపాయల భారం మోపిందన్నారు. మూడు రకాల సర్దుబాటు ఛార్జీల పేరుతో9863 కోట్ల రూపాయలను అదనంగా వసూలు చేయడం దుర్మార్గమన్నారు. ఇదే వైఖరి టిడిపి కూటమి ప్రభుత్వంలోనూ కొనసాగితే మరోసారి మహోద్యమ తీవ్రతను చవి చూడాల్సి ఉంటుందని నేతలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు కందారపు మురళి, జయచంద్ర, మాధవ్, సాయిలక్ష్మి, లక్ష్మి, హేమలత, కె.వేణుగోపాల్, సిపిఐ నాయకులు ఎన్‌డి రవి, గోవిందస్వామి, శివ పాల్గొన్నారు.

ప్రభుత్వ గర్ల్స్ హోంను పరిశీలించిన సీతారాం

తిరుపతి టౌన్ : నగరంలోని సరోజిని దేవి రోడ్‌లో గల ప్రభుత్వ బాలికల హెూమ్ ను ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం బుధవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఇటీవల ఈ హోంకు చెందిన విద్యార్థినిపై లైంగిక దాడి జరగడంపై సీతారాం ఆరా తీశారు. హోం సూపరింటెండెంట్ సి.నయోమి తోను, ఇతర సిబ్బందితోనూ విడివిడిగా మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. హోం పర్యవేక్షకుల నిర్లక్ష్యమా, లేక ఇతర కారణాలేవైనా ఉన్నాయా? అనే దానిపై సమగ్ర నివేదికను పంపాలని జిల్లా ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ఇటువంటి లైంగిక దాడుల ఆరోపణలు భవిష్యత్‌లో జరగకుండా లోతైన అధ్యయనం చేయాలన్నారు. జిల్లా ఉన్నతాధికారులు అందించే నివేదిక ఆధారంగా క్రమశిక్షణా చర్యలు చేపడతామన్నారు. అనంతరం పిల్లలకు అందిస్తున్న భోజన సదుపాయంపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్శనలో జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్‌పర్సన్ ఎం.వసంత, సభ్యులు పివిఎస్ రవికుమార్, పి.చంద్రశేఖర్‌రెడ్డి, బి.మురళీమోహన్, ఎల్.కృష్ణమనాయుడు పాల్గొన్నారు.

3-5 తేదీల్లో సిఐటియు జిల్లా విస్తృత సమావేశాలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

సిఐటియు జిల్లా విస్తృత సమావేశం సెప్టెంబర్ 3-5 తేదీల్లో తిరుపతిలో జరగనుందని జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి వెల్లడించారు. ఈ సందర్భంగా ఏకీకృత పెన్షన్ స్కీమ్‌పై చర్చించి, భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఈ సమావేశాలకు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, రాష్ట్ర నేత సుబ్బరావమ్మ హాజరవుతారని తెలిపారు. పాత పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయకుండా ప్రత్యామ్నాయ స్కీమ్ పేరిట ఏకీకృత పెన్షన్ స్కీమును కేంద్రం తీసుకొచ్చి ఉద్యోగులకు ద్రోహం చేసిందన్నారు. పాత పెన్షన్ స్కీమే అన్ని రకాలుగా ప్రయోజనకరమని తెలిపారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమును, ఏకీకృత పెన్షన్ స్కీమును తక్షణం ఉపసంహరించుకుని పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా రానున్న రోజుల్లో కేంద్ర కార్మిక సంఘాలు జాతీయ సమ్మెను చేపట్టనున్నట్లు ప్రకటించారు.

రేణిగుంట బీసీ హాస్టల్ పనులు వేగవంతం

ప్రజాశక్తి - రేణిగుంట

గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల అస్తవ్యస్థంగా తయారైన బీసీ హాస్టల్‌ను రెండు వారాల ముందు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి సందర్శించారు. హాస్టల్ సంరక్షణ తన బాధ్యతగా తీసుకుంటానని మాట ఇచ్చి మడమ తిప్పకుండా పనులను చేపట్టారు .ఎమ్మెల్యే ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ నాయకుల పర్యవేక్షణలో రేణిగుంట ప్రభుత్వ బాలుర వసతి గృహం నందు అత్యాధునిక వసతులతో మరుగుదొడ్లు, తాగునీరు, మినరల్ వాటర్, వంటగది, స్నానపు గదులు నిర్మాణ పనులను వేగవంతం చేశారు . అలాగే హాస్టల్ లోని ప్రతి ఒక్క రూముకు పెయింటింగ్ వేయించారు. మరమత్తుల నిమిత్తం ఎమ్మెల్యే తన సొంత నిధులను వెచ్చించి మరోసారి దాతృత్వం చాటుకున్నారు.

వెటర్నరీ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

వెటర్నరీ యూనివర్సిటీలో పనిచేసేటటువంటి కాంట్రాక్టు డైలీ వేర్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షులు చినబాబు డిమాండ్ చేశారు. బుధవారం వెటర్నరీ కాలేజీలో నూతన కమిటీ ఏర్పాటయ్యింది. దాదాపు 20 ఏళ్లుగా పనిచేస్తున్నా కనీసం ఐడి కార్డులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అరకొర జీతాలతో కుటుంబాలు గడవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కే వేణుగోపాల్, సిఐటియు ఉపాధ్యక్షులు టి.సుబ్రహ్మణ్యం, బుజ్జి పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అస్వస్థత

ప్రజాశక్తి - నాయుడుపేట

జులై నెలలో నాయుడుపేట గురుకుల పాఠశాలలో 150 మంది విద్యార్థులు కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన విషయం మరువక ముందే, మళ్లీ మరో 11 మంది విద్యార్థులు మంగళవారం అస్వస్థతకు గురయ్యారు. దీంతో అసలు గురుకుల పాఠశాలలో ఏం జరుగుతోంది అంటూ విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. మంగళవారం 11 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైతే విషయం బయటకు పొక్కనీకుండా సిబ్బంది గుట్టుచప్పుడు కాకుండా తల్లిదండ్రులను పిలిపించి ఇళ్లకు పంపేశారు. బయట ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకుని, ఆరోగ్యం కుదుట పడిన తరువాత రమ్మని చెప్పడం గమనార్హం.

విద్యార్థులను ఎందుకు పంపిస్తున్నారని ఉపాధ్యాయులను ప్రశ్నించగా ముందస్తుగా వినాయక చవితి సెలవులు ఇచ్చేస్తుండటం గమనార్హం. విద్యార్థి సంఘాల చొరవతో విషయం బయటకు రావడంతో చేసేది లేక విషయాన్ని బయట పెట్టారు. విషయం తెలిసిన తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్ గురుకుల పాఠశాలను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పిల్లలకు తల్లిదండ్రులు తెస్తున్న తినుబండారాలు పాడైపోవడంతో అవి తినడం వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని తల్లిదండ్రులను నేరస్తులుగా ప్రిన్సిపాల్ చెప్పడం గమనార్హం. అయితే గురుకుల పాఠశాలలో పెడుతున్న చికెన్ కారణంగానే విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయ్యిందని విద్యార్థిసంఘాల ఆరోపణ. ఏదిఏమైనా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జిల్లా ఉన్నతాధికారులు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను తప్పకుండా యాజమాన్యాలు పాటించాలని, సెక్యూరిటీ ప్లాన్, డిజాస్టర్ మేనేజ్మెంట్ ప్లాన్ సిద్ధంగా ఉండాలని కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు పరిశ్రమల శాఖ, పోలీస్ తదితర సంబంధిత శాఖలతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పరిశ్రమలకు పెద్ద పీట వేస్తున్నారని, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని ఆదేశించిన నేపథ్యంలో ఈసమావేశం నిర్వహించామన్నారు. ఈ మధ్యనే మన జిల్లాలో ముగ్గురు వేర్వేరు పరిశ్రమల్లో వివిధ కారణాల వలన

ప్రమాదాల బారిన పడి చనిపోవడం దురదృష్టకరమన్నారు. పరిశ్రమల్లో ఏదైనా ప్రమాదం జరిగిన సందర్భాల్లో ఆలస్యంగా జిల్లా యంత్రాంగానికి సమాచారం అందుతోందన్నారు. అలాగాకుండా వెంటనే తెలిస్తే జిల్లా యంత్రాంగం నుంచి తగు చర్యలు చేపట్టి, అపాయం తీవ్రతను తగ్గించే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో 12 అత్యంత ప్రమాదకర కేటగిరీలో, 107తక్కువ ప్రమాదకర కేటగిరీలో పరిశ్రమలు ఉన్నాయన్నారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి వివరిస్తూ దాదాపు అన్ని పరిశ్రమలను తనిఖీ చేశామని, భద్రతా ప్రమాణాలకు సంబంధించిన నోటీసులను పలు పరిశ్రమలకు ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో పిసిబి అధికారి మదనగోపాల్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి రమణయ్య, జిల్లా పరిశ్రమల శాఖ ఇంఛార్జి అధికారి రామ్మూర్తి, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకష్ణ రెడ్డి, జోనల్ మేనేజర్ ఏపీఐఐసి చంద్ర శేఖర్, కాలుష్య నియంత్రణ మండలి ఏఈ మదన్ మోహన్ పాల్గొన్నారు.

టిటిడిలో విజిలెన్స్ నోటీసుల కలకలం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానంలో విజిలెన్స్ నోటీసులు ప్రకంపనలు సష్టిస్తున్నాయి. టీటీడీ మాజీ ఛైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డిలకు స్టేట్ విజిలెన్స్ ఎన్ ఫోర్స్ మెంట్ విభాగం నోటీసులు ఇచ్చింది. వీరితో పాటు మాజీ ఈవోలు జవహర్ రెడ్డి, ధర్మారెడ్డి.. చీఫ్ అకౌంట్ ఆఫీసర్ బాలాజీలకు నోటీసులు పంపారు. శ్రీవారి ట్రస్ట్ నిధులను ఆలయాల నిర్మాణాలకు కాకుండా ఇతర అవసరాలకు వినియోగించారనే ఆరోపణలపై నోటీసులు ఇచ్చారు. గోవిందరాజ స్వామి సత్రాలు కూల్చివేతకు ఆర్ అండ్ బీ అనుమతి తీసుకోలేదని విజిలెన్స్ అధికారుల విచారణలో తేలింది. అలాగే మాజీ ఈవో ధర్మారెడ్డి బర్డ్ డైరెక్టర్‌గా ఉండటం అంశంపైనా విచారణ చేపట్టారు. గత రెండు నెలలుగా టీటీడీలో విజిలెన్స్ ఎన్ ఫోర్స్ మెంట్ వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేస్తోంది. అన్ని విభాగాల్లో గత ఐదేళ్లలో ఎలాంటి లావాదేవీలు జరిగాయి అన్న దానిపై విచారణ జరుపుతోంది. ప్రధానంగా ఇంజినీరింగ్ విభాగంలో అవకతవకలు జరిగినట్లుగా గుర్తించినట్లుగా సమాచారం.

ఇంజినీరింగ్ విభాగంలో గతంలో ఏడాదికి 300 కోట్లు మాత్రమే నిధులు కేటాయించే వారు. అయితే, వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి బోర్డుల సమయంలో అంతకుమించి నిధుల కేటాయింపులు జరిపినట్లు గుర్తించారు. గోవిందరాజ స్వామి సత్రాలకు దాదాపు రూ.450 కోట్లు కేటాయించారు. స్విమ్స్ ఆసుపత్రిలో భవనాల నిర్మాణానికి భారీ ఎత్తున నిధులు రూ.77 కోట్లు కేటాయించారన్న దానిపై అధికారులు విచారణ జరుపుతున్నారు. టీటీడీలో శ్రీవాణి ట్రస్ట్ నిధులు, ఇంజనీరింగ్ విభాగంలో భారీ అవినీతి జరిగిందని టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో టీటీడీలోని అన్ని విభాగాల్లో విజిలెన్స్ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు తనిఖీలు, విచారణలు జరిపింది. ఈ రెండు నెలలుగా గుర్తించిన అంశాలపై భూమన, ధర్మారెడ్డిలకు నోటీసులు జారీ చేశారు. టీటీడీలో చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ బాలాజీకి కూడా నోటీసులు ఇచ్చారు. నోటీసులకు సమాధానం చెప్పాలని అందులో పేర్కొన్నారు. త్వరలోనే వైవీ సుబ్బారెడ్డి, భూమన, కరుణాకర్ రెడ్డి, ధర్మారెడ్డి వివరణ ఇచ్చుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఇంటెగ్రిటీ గ్లోబల్ సర్వీస్ ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇంటిగ్రిటీ గ్లోబల్ సర్వీస్‌ను టిడిపి సీనియర్ నాయకులు డాలర్ దివాకర్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. స్థానిక బైరాగిపట్టెడలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆ సంస్థ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ విదేశాల్లో ఉన్నత చదువులు చదివేందుకు ఆసక్తి చూపే విద్యార్థులకు మెరుగైన ఈ సంస్థ ఎంతో సహకరిస్తుందన్నారు. ఇలాంటి కార్యాలయాలు హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు వంటి ప్రాంతాల్లో మాత్రమే ఉండేవని, ఇప్పుడు తిరుపతి వాసులకి అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆ సంస్థ అధినేత ఆశీష్ రెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ఆస్ట్రేలియా, కెనడా, యుఎస్ఏ వంటి విదేశాలలో విద్యను అందించేందుకు విద్యార్థులకు స్టూడెంట్ వీసా, పర్యాటకులకు టూరిస్ట్ వీసా ఎలాంటి కన్సల్టెన్సీ ఫీజులు లేకుండానే ఉచితంగా అందిస్తామన్నారు. వివరాలకు 8919218881 ఫోన్ నెంబర్ ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మురళీ కుమార్ రెడ్డి, కోటేశ్వర్ రెడ్డి, క్షేత్ర తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎస్వీయూలో ఉద్యోగ మేళా

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ఎంప్లాయిమెంట్ కార్యాలయం మోడల్ కెరీర్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 30న ఉద్యోగ మేళాను నిర్వహించనున్నట్లు ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ బ్యూరో డిప్యూటీ చీఫ్ టి. శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి నుండి ఏదేని డిగ్రీ విద్యార్హత గల అభ్యర్థులు వారి విద్యార్హత గల ధ్రువపత్రాలతో ఎంప్లాయిమెంట్ కార్యాలయానికి ఉదయం 10 గంటలలోపు చేరుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9533889902, 7989810194 ను సంప్రదించాలని కోరారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులు సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

స్విమ్స్ ఆధ్వర్యంలో పింక్ బస్సుల ద్వారా ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులు, అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఉపకులపతి డాక్టర్ ఆర్‌వి కుమార్ తెలిపారు. క్యాన్సర్ వ్యాధిని మొదటి దశలోనే గుర్తించి పూర్తిగా నయం చేసేందుకు వీలుగా రెండు పింక్ బస్సుల ద్వారా ఈ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తిరుపతి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలపై సంస్థ ప్రధానంగా దష్టి కేంద్రీకరించింది. జిల్లాలో మొత్తం 85 పిహెచ్‌సిలు ఉండగా, ఇప్పటి వరకు 22 పిహెచ్‌సిల పరిధిలో 200కు పైగా వైద్య శిబిరాలు నిర్వహించింది. ఆరు నెలల వ్యవధిలో జిల్లాలో టార్గెట్‌గా ఉన్న 22 శాతం జనాభాలో దాదాపు 12 శాతం మందిని క్యాన్సర్ సర్వే చేసింది. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో పింక్ బస్సుల క్యాంపులు జరిగినపుడు మహిళలు, పురుషులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొంది.

తాగి వాహనం నడిపితే జైలుకే...

తిరుపతి సిటీ : ఇకపై తాగి వాహనం నడిపితే జైలుకెళ్లక తప్పదని ఎస్‌పి సుబ్బరాయుడు హెచ్చరించారు. ప్రమాదం జరిగినపుడు అందులో ఆత్మీయులు కూడా ఉండవచ్చని, ప్రాణం ఖరీదు వెలకట్టలేనిదని అన్నారురు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన 26 మంది నిందితులకు ఒక్కొక్కరికి 10వేల చొప్పున 2 లక్షల 60వేలు జరిమానా, రెండు రోజులు జైలుశిక్ష విధించారు. 9 మంది డ్రైవర్లకు జరిమానాతో పాటు జైలుశిక్షను నాలుగో అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు తిరుపతి జడ్జి గంధి శ్రీనివాస్ విధించారు.

శ్రీసిటీని సందర్శించిన సీజీఎస్టీ కమిషనర్

ప్రజాశక్తి - సత్యవేడు

సీజీఎస్టీ ఆడిట్ కమీషనర్ (ఆంధ్రప్రదేశ్) పి.ఆనంద్ కుమార్ బుధవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలు, కంపెనీలకు అందిస్తున్న వివిధ సదుపాయాలు, ఇక్కడ చేపడుతున్న సుస్థిరతా చర్యలు, కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాలను వివరించారు. బహుళ రంగాలలో పెరుగుతున్న ఎగుమతి కార్యకలాపాలపై సంతప్తి వ్యక్తం చేశారు. జీఎస్టీ చెల్లింపులోనూ శ్రీసిటీ పనితీరును కొనియాడారు.

'గల్లా' స్వగృహంలో సుమన్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - రేణిగుంట

సుప్రసిద్ధ నటుడు, తెలుగు సినిమా హీరో సుమన్ తల్వార్ జన్మదినం సందర్భంగా తిరుపతి సమీపంలోని కరకంబాడి నందు గల గల్లా అరుణ కుమారి స్వగహం నందు అమర రాజా ఫౌండర్ చైర్మన్ గల్లా రామచంద్ర నాయుడు ,మాజీ మంత్రివర్యులు గల్లా అరుణ కుమారి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు, అనంతరం గల్లా రామచంద్ర నాయుడు, గల్లా అరుణ కుమారి దుశ్శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అమర రాజా సంస్థ ఉద్యోగులు, సుమన్ అభిమానులు పాల్గొన్నారు.

గంధోత్సవానికి నటుడు సుమన్‌కు ఆహ్వానం

స్థానిక దర్గా హజరత్ జుమ్మేషాపీర్ దర్గాలో త్వరలో జరగబోయే ఉరుసు ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే గంధోత్సవానికి రావాలంటూ పీఠాధిపతి సయ్యద్ అహ్మద్, దర్గా నిర్వాహకులు సయ్యద్ బాబా ఫరీద్ లు ప్రముఖ సినీ నటుడు సుమన్ కు బుధవారం ఆహ్వాన లేఖ అందజేశారు. స్పందించిన సుమన్ దర్గా భక్తుడిగా తప్పకుండా గంధోత్సవంలో పాల్గొంటానని హామీ ఇచ్చారు. ఉరుసు కమిటీ ప్రెసిడెంట్ ఓరుగంటి నాగేశ్వరరావు, ఆర్గనైజర్స్ న్యాయవాది గుమ్మళ్ల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నల్లగంగమ్మ జాతర

ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి): మండలంలోని రామిరెడ్డిపల్లి పంచాయతీ నాగయ్యగారి పల్లి హరిజనవాడలో బుధవారం నల్ల గంగమ్మ జాతరను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. గ్రామానికి చెందిన మురళి, సునీల్ నాయుడు ఆహ్వానం మేరకు టీడీపీ నాయకులు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, ఎ.జీ.పల్లి బాల తదితరులు గ్రామానికి చేరుకొని అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో నాగులయ్య, చంద్రబాబు, నాగరాజ నాయుడు, మురళి నాయుడు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని గోవిందప్ప నాయుడు కండ్రిగలో అధికారులు పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. 32 పాడి పశువులకు వైద్య పరీక్షలు చేపట్టారు. 12 పశువులకు గర్భకోశ వ్యాధికి సంబంధించి చికిత్స చేశారు. గోపాల, పిండదు మందులను పిచికారి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మునీశ్వరి, డాక్టర్ మునిరాజ, డాక్టర్ వీరభద్రారెడ్డి, డాక్టర్ శరత్ చంద్రారెడ్డి, డాక్టర్ నరేష్, డాక్టర్ గౌరీ పాల్గొన్నారు.

సీఐని కలిసిన నాయకులు

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు రెండో పట్టణ సీఐ జె.శ్రీనివాస్‌ను బుధవారం పట్టణ టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, ట్రాఫిక్ ఇబ్బందులపై సీఐకి వివరించి చర్యలు చేపట్టాలని కోరారు. నాయకులు భాస్కర్ రెడ్డి, చెంచు రామయ్య, ఇస్మాయేల్ కుమార్, అబ్దుల్ రహీం, మస్తాన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల పరిశుభ్రతపై అధికారులు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో త్రివిక్రమ్ రావు, ఎంఈవో రవీంద్రనాథ్, సుబ్రమణ్యంలు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ హెల్పర్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్, ఎస్ఎంసి చైర్మన్, సభ్యులు కలిసి ప్రతి సోమవారం, బుధవారం ఆయా పాఠశాలల్లో మరుగుదొడ్లను పరిశీలించి యాప్‌లో ఫోటోలు అప్‌లోడ్ చేయాలని సూచించారు. పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఆర్పీలు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు మున్సిపాలిటీలోని గాంధీనగర్ ప్రాంతంలో దాతల సహకారంతో నిర్మిస్తున్న మాతమ్మ ఆలయ నిర్మాణ పనులకు బుధవారం భూమి పూజ చేపట్టారు. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ హాజరై భూమి పూజలో పాల్గొన్నారు. పెంచల కోన నరసింహ స్వామి ఆలయ మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ నానాజీ, నాయకులు భాస్కర్ రెడ్డి, చెంచు రామయ్య, రహీం, పెంచలయ్య పాల్గొన్నారు.

'కళాకారుల సమస్యలు పరిష్కరించండి'

ప్రజాశక్తి-తడ: తప్పెట కళాకారుల సమస్యలు పరిష్కరించాలని బుధవారం మండల ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ శరత్‌కు కళాకారులు వినతి పత్రం అందించారు. గతంలో అధికారంలో వున్న టిడిపి ప్రభుత్వం తప్పెట కళాకారులకి రెండు ఎకరాల భూమిని ఇస్తానని హామీ ఇచ్చారని, హామీని నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో డప్పు కళాకారుల రాష్ట్ర కమిటీ సభ్యులు సుబ్బారావు, సిపిఎం నాయకులు చంద్రశేఖర్, సిఐటియు మండల అధ్యక్షులు రమణయ్య, కార్యదర్శి లక్ష్మయ్య, దూడల రఘు, దయాలన్, దొరవేలు, బుజ్జయ్య, సుబ్బరామయ్య, మునిక్రిష్ణయ్య పాల్గొన్నారు.

'ఎస్ బ్యాంక్ డిపాజిట్లు వృద్ధి'

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: భారతదేశపు అతిపెద్ద ప్రైవేట్ రంగ ఎస్ బ్యాంక్ మొత్తం డిపాజిట్లలో ఇయర్ ఆన్ ఇయర్ చెప్పుకోదగ్గ రీతిలో 20.9శాతం వృద్ధిని సాధించిందని ఆ బ్యాంక్ ప్రతినిధి తెలిపారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం 2025 మొదటి త్రైమాసికం నాటికి ఇది రూ.2,65,072కోట్లకు చేరుకుందన్నారు. ఈ గణనీయ వృద్ధి, బ్యాంక్‌పై కస్టమర్లు ఉంచిన బలమైన నమ్మకం, విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. తమకు సహకరిస్తున్న ఖాతాదారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులకు శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఇస్కాన్‌లో జరిగిన వ్యాసరచన, డిబేట్ పోటీల్లో ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులను ప్రదానం చేశారు. అధిక సంఖ్యలో బహుమతులను అందుకున్న సందర్భంగా బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.నారాయణమ్మ వారిని అభినందించారు. కళాశాల కో-కరికులర్ కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణవేణి, యూనియన్ ఇన్‌ఛార్జ్ డాక్టర్ బి.జ్యోతి, గణిత శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ధనలక్ష్మి, డాక్టర్ మమత, తెలుగు అధ్యాపకులు డాక్టర్ శోభ, కళాశాల అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించారు.

ఘనంగా ఉట్లోత్సవం

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీకృష్ణ స్వామివారి ఆలయంలో గోకులాష్టమి సందర్భంగా బుధవారం సాయంత్రం వేడుకగా ఉట్లోత్సవం జరిగింది. ఇందులో భాగంగా శ్రీకృష్ణ స్వామికి అభిషేకం చేపట్టారు. ఊంజల్‌సేవ, ఊరేగింపు సందర్భంగా ఉట్లోత్సవం, ఆస్థానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గణేష్, ఇతర అధికారులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



పెరుమాళ్ళపల్లె జెడ్పీహెచ్ఎస్‌కు జిల్లా స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డు

ప్రజాశక్తి-సోమల: జిల్లా స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డును తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్ళపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల కైవసం చేసుకుంది. గురువారం క్రీడా దినోత్సవం సందర్భంగా తిరుపతిలో నిర్వహించే జిల్లా స్థాయి అవార్డు ప్రదాన ఉత్సవంలో పెరుమాళ్ళపల్లె పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు బి.నాగమల్లేశ్వరి అవార్డు అందుకోనున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాఠశాల విద్యార్థులు పలు క్రీడా పోటీలలో గోల్డ్ మెడల్ సాధించి పాఠశాలకు ఎంతో పేరు ప్రఖ్యాతలు తెచ్చారు. ఇదే క్రమంలో వ్యాయామ ఉపాధ్యాయురాలు విద్యార్థులకు పలు క్రీడా అంశాలలో నైపుణ్యాలను నేర్పించి వారిలో దాగివున్న ప్రతిభను గుర్తించి వారికి శిక్షణ ఇచ్చి పోటీలలో పాల్గొనే విధంగా ప్రోత్సహించారు. ఆమె నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎన్నో పతకాలు సాధించి అటు పాఠశాలకు ఇటు తమకు క్రీడలు నేర్పించిన వ్యాయామ ఉపాధ్యాయురాలికి పేరు తీసుకొచ్చారు. గురువారం జరగనున్న జిల్లా స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డులో తిరుపతి జిల్లా స్థాయిలో ఐదు పాఠశాలలు ఎంపిక కాగా అందులో పెరుమాళ్ళపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల ఎంపిక కావడం గమనార్హం. తమ పాఠశాల జిల్లా స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డుకు ఎంపిక కావడం అందుకు కారణమైన వ్యాయామ ఉపాధ్యాయురాలను పాఠశాల హెచ్ఎం వి.నాగరాణి, ఉపాధ్యాయ బృందం గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

నేడు అవార్డు అందుకోనున్న వ్యాయామ ఉపాధ్యాయురాలు నాగమల్లేశ్వరి

నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే ఆదిమూలం

ప్రజాశక్తి-సత్యవేడు: నియోజవర్గంలోని 7మండలాల సమగ్రాభివృద్దే లక్ష్యంగా పనిచేస్తానని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం స్పష్టం చేశారు. బుధవారం సత్యవేడు కూరగాయలు సంత ఆవరణలో రూ.1.70 కోట్లు నిధులతో నిర్మించ తలపెట్టిన టిటిడి కళ్యాణ మండపానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలలో జరిగే పెళ్ళిళ్ళు వంటి శుభకార్యాలు తక్కువ ఖర్చుతో చేసుకునే వెసులుబాటు కలిగిందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

కుంభాభిషేక మహోత్సవంలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పిచ్చాటూరు: మండలంలోని రెప్పాలపట్టు గ్రామంలో అరుణానది ఒడ్డున నూతనంగా నిర్మించిన నాంచారమ్మ ఆలయ కుంభాభిషేక మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదిమూలం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాంచారమ్మ ఆశీస్సులతో ఆరణియార్ రిజర్వాయర్ నిండుకుండలా నిండి అన్నదాతలు ఆనందంతో సుభిక్షంగా పాడి పంటలు పండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఇలంగోవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవాణి ట్రస్ట్ నిధులతో కళ్యాణమండపాలు నిర్మించాలి: కిరణ్ రాయల్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శ్రీవాణి ట్రస్ట్ నిధులతో ఆలయాల పునరుద్ధరనే కాకుండా సామాన్య మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా టిటిడి, శ్రీ స్వామి హథీరాంజీ మఠంకు చెందిన స్థలాలను ఎంపిక చేసి కళ్యాణ మండపాల నిర్మాణం చేపట్టాలని జనసేన పార్టీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కిరణ్ రాయల్ అన్నారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్లో ఆయన మాట్లాడారు. ఇప్పటికే గత వైసిపి ప్రభుత్వ హాయంలో జరిగిన అవినీతి, అక్రమాలపై కూటమి ప్రభుత్వం విచారిస్తున్న నేపథ్యంలో టిటిడి మాజీ ఛైర్మన్లు వైవి సుబ్బారెడ్డికి, భూమన కరుణాకర రెడ్డికి, మాజీ ఈఓలు జవహర్రెడ్డికి, ధర్మారెడ్డికి, టిటిడి ఫైనాన్స్ చూస్తున్న బాలాజీకి, ఇంజినీరింగ్ విభాగంలో నాగేశ్వరరావుకు నోటీసులు ఇచ్చారన్నారు. టిటిడి నుండే ప్రక్షాలన మొదలైందన్నారు. శ్రీవాణి ట్రస్ట్ నిధులు రూ.350కోట్ల రూపాయలతో ఆలయాల తిరిగి నిర్మించామని చెప్పారని, దానిపై కూడా పూర్తి స్థాయిలో విచారణ జరుగుతోందన్నారు. సామాన్య మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా శ్రీవాణి ట్రస్ట్ నిధులతో కళ్యాణ మండపాల నిర్మాణ అంశాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి నేరుగా తీసుకెళ్ళి అవసరమైన సరవరణలు, చర్యలు తీసుకునేలా కృషి చేస్తామన్నారు. సమావేశంలో హెమకుమార్, సుమన్, సుమంత్, కిషోర్, శ్రీనివాసులు, బాలు, రాజేంద్ర, లోకేష్, భాను, సుధా పాల్గొన్నారు.

శివారు ప్రాంతాలపై ఇంత నిర్లక్ష్యమా..?

- 14వ వార్డు కౌన్సిలర్ శంకరయ్య ఆరోపణ

ప్రజాశక్తి-వెంకటగిరి: శివారు ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పనపై మున్సిపల్ అధికారులు ఛైర్మన్ నిర్లక్ష్యం వహిస్తున్నారని 14వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య ఆరోపించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 14వ వార్డులోని బొగ్గుల మిట్ట, ధర్మపురం, నరసింహారావు వీధి, కోర్ట్ సెంటర్ ముత్తరాశిపాలెం ప్రాంతాల్లో ఆరు నెలల నుంచి వీధి దీపాలు వెలగడం లేదని తెలిపారు. ఇదే విషయం గతంలో ఛైర్మన్‌కు అర్జీ రూపంలో విన్నవించినా ఫలితం లేదన్నారు. మూడు నెలలుగా మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు సైడ్ కాలవలు, వీధులు శుభ్రపరచడం లేదని, ప్రధాన రోడ్లు మాత్రం రోజు శుభ్రం చేస్తూ, పెద్దల నివాసం ఉన్న చోట మాత్రం శుభ్రపరుస్తూ పేదల నివసిస్తున్న ప్రాంతాలను పట్టించుకోవడం లేదన్నారు. 8 నెలలుగా పారిశుధ్య కార్మికులకు జీతాలు ఇవ్వడం లేదని, కౌన్సిల్ సమావేశంలో బిల్లులు పాస్ అయినా ఛైర్మన్ వద్దకు తీసుకొని వెళ్లినా సంతాకలు చేయడం లేదనీ కార్మికులు చెబుతున్నారన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ జోక్యం చేసుకొని సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు.

బొగ్గులమిట్టలో పేరుకుపోయిన చెత్తను చూపుతున్న వార్డు కౌన్సిలర్ శంకరయ్య

అప్రమత్తంగా ఉండండి

- విద్యార్థులకు మహిళా పోలీసుల సూచన

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, ఊహించని ప్రమాదాల పట్ల మరింత జాగ్రత్తగా ఉండాలని విద్యార్థులకు మహిళా పోలీసులు సూచించారు. బుధవారం శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ విద్యార్థులతో సమావేశమై నూతన క్రిమినల్ చట్టాలు, సైబర్ క్రైమ్, లోన్ యాప్స్, అనుమానిత లింక్స్, మహిళా సంబంధిత నేరాలు, ర్యాగింగ్, సోషల్ మీడియా మోసాలు, బాల్య వివాహాలు వంటి విషయాలపై విపులంగా అవగాహన కల్పించి, విద్యార్థులను చైతన్యవంతులను చేశారు.

విద్యార్థులకు జీవన నైపుణ్యాలు ఎంతో అవసరం: రాజేష్

ప్రజాశక్తి-క్యాంపస్: విద్యార్థి దశలో విద్యార్థులు సరైన జీవన నైపుణ్యాలను, భాషణా నైపుణ్యా లను పెంపొందించుకోవాలని లీగల్ స్ట్రాటజీ గవర్నెన్స్ జనరల్ కౌన్సిల్ కన్సల్టెంట్ రాచమల్ల రాజేష్ పేర్కొన్నారు. ఎస్వీయూలోని ఆర్థిక శాస్త్ర విభాగం సెమినార్ హాల్లో ఆర్థిక శాస్త్ర విభాగం, పొలిటికల్ సైన్స్ విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్, నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా చదువులలో రాణించడమే కాకుండా ఉన్నత ఉద్యోగాలలో ఉన్నతంగా రాణించేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. కుటుంబంలో, స్నేహితులతో సరదాగా ఇంగ్లీషులో మాట్లాడుతూ ఉండడం ద్వారా ఆంగ్ల నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చు అని సూచించారు. ఎస్వీయు ఆర్ట్స్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్, డీన్ ఆచార్య బివి.మురళీధర్ మాట్లాడుతూ విద్యార్థులు సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టు సాధించడం ద్వారా అన్ని విభాగాలలో సంపూర్ణమైన విజయం సాధించేందుకు ఉన్నతమైన అవకాశాలు కలిగి ఉంటాయన్నారు. కార్యక్రమంలో అర్థశాస్త్రం, పొలిటికల్ సైన్స్ విభాగం అధ్యాపకులు, అకడమిక్ కన్సల్టెంట్లు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



లక్కీడిప్‌లో శ్రీవారి అంగప్రదక్షిణ టోకెన్ల కేటాయింపు

ప్రజాశక్తి-తిరుపతి బ్యూరో: ప్రతి శనివారం తిరుపతి అర్బన్, తిరుమల స్థానికులకు కేటాయిస్తున్న 250 శ్రీవారి ఆలయ అంగప్రదక్షిణ టికెట్లు, ఇకపై లక్కీడిప్ ద్వారా కేటాయించనున్నట్లు బుధవారం టిటిడి ఒక ప్రకటనలో తెలిపింది. అంగప్రదక్షిణ టికెట్లు కావలసిన భక్తులు గురువారం ఉదయం10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తమ ఆధార్ కార్డుతో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆ ప్రకటనలో పేర్కొంది. వీరికి సాయంత్రం 5గంటలకు లక్కీడిప్ ద్వారా టికెట్లు కేటాయించబడుతుందని తెలిపింది. టికెట్లు పొందిన భక్తులకు వారి మొబైల్ ఫోన్లకు ఎస్ఎంఎస్ రూపంలో సమాచారం అందిస్తూ, ఆన్‌లైన్‌లో ఉంచబడుతుందని సూచించారు. టికెట్లు పొందిన భక్తులు ఆన్లైన్‌లో రూ.500 డిపాజిట్ చేయవలసి ఉంటుందని, లక్కీ డిప్‌లో టికెట్లు పొందిన భక్తులు మహతి కళాక్షేత్రంలో తమ ఆధార్ కార్డు చూపి శుక్రవారం మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8గంటల వరకు అంగప్రదక్షిణ టికెట్లు పొందవచ్చునని సూచించింది. భక్తులను శనివారం తెల్లవారుజామున అంగప్రదక్షిణకు అనుమతిస్తారు. అనంతరం భక్తులు చెల్లించిన రూ.500 డిపాజిట్‌ను తిరిగి వారి ఖాతాల్లోకి టీటీడీ జమ చేస్తుంది. తిరుపతి అర్బన్, తిరుమల స్థానికులు కానీ భక్తులు లక్కీ డిప్‌లో అంగప్రదక్షిణ టోకెన్లు పొందిన వారికి, వారు చెల్లించిన రూ.500 డిపాజిట్ టీటీడీ తిరిగి చెల్లించదు, అంగప్రదక్షిణకు అనుమతించబడరు. ఈ విషయాన్ని గమనించి భక్తులు టిటిడికి సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేస్తోంది.



పారిశుద్ధ్యంపై శ్రద్ధ చూపాలి: ఎంపిపి

సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి-దొరవారిసత్రం: గ్రామీణ ప్రాంతాలలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపిపి దువ్వూరు సుజాతమ్మ అన్నారు. బుధవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ రానున్న వర్షాకాల నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సమస్యపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మండలంలోని పలు శాఖ అధికారులు వారి వారి శాఖలపై అభివృద్ధి పనుల గురించి వివరించారు. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, తదితరల శాఖల అధికారులు వారు చేసిన పనులు గురించి మాట్లాడారు. గ్రామాలలో సీజన్ వ్యాధులపై అవగాహన కలిగించి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని ఎంపిపి సూచించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు దువ్వూరు గోపాల్ రెడ్డి, జడ్పిటిసి రమేష్, తహశీల్దార్ శైల కుమారి, సిడిపిఒ శారదాంబా, పలు శాఖ అధికారులు పాల్గొన్నారు.

తొట్టంబేడు ఎస్ఐగా ఈశ్వరయ్య

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి: తొట్టంబేడు ఎస్ఐగా కె.ఈశ్వరయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న రాఘవేంద్ర భాకరాపేటకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో యర్రావారిపాళెం పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న ఈశ్వరయ్య తొట్టంబేడుకు వచ్చారు. తొట్టంబేడు ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన ఈశ్వరయ్యకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

తడ ఎస్ఐగా కొండప్ప నాయుడు

ప్రజాశక్తి-తడ: తడ ఎస్ఐగా కె.కొండప్ప నాయుడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి విఆర్ నుంచి ఆయన తడకు బదిలీపై వచ్చారు.

'ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించండి'

తహశీల్దార్‌కి విన్నవిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శివనాథపాలెం గ్రామ రెవెన్యూ లెక్క దాఖలాలో బ్లాక్ నంబర్ 9లో ఉన్న వంద ఎకరాల ప్రభుత్వ భూమికి రక్షణ కల్పించాలంటూ ఆ గ్రామస్తులు బుధవారం తొట్టంబేడు తహశీల్దార్ మధుసూదన్ రావుకు వినతి పత్రం అందించారు. తమ గ్రామానికి చెందిన పొలాలను శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన కొందరు పెద్ద ఎత్తున కబ్జా చేసి మామిడి చెట్లు, నీలగిరి చెట్లు సాగు చేస్తున్నారంటూ వారు వాపోయారు. ఇదెక్కడి న్యాయం అంటూ ప్రశ్నిస్తే శ్రీకాళహస్తికి వస్తే మీ అంతు చూస్తామంటూ బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి బ్లాక్ నెంబర్ 9లో ఉన్న ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాలని కోరారు.

ప్రభుత్వ నిర్ణయంపై నాయీబ్రాహ్మణుల హర్షం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర వ్యాప్తంగా అన్ని దేవదాయ ధర్మాదాయ శాఖకు చెందిన ఆలయాల్లో విధులు నిర్వర్తించే నాయీబ్రాహ్మణులకు సీఎం చంద్రబాబు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన రూ.25వేల వేతన హామీ అమలుకు నిర్ణయం తీసుకోవడంపై రాష్ట్ర నాయీబ్రాహ్మణ సేవా సంఘం కార్యదర్శి ఆవులపాటి బుజ్జిబాబు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్లో ఆయన మాట్లాడారు. అలానే టిటిడిలో పనిచేస్తున్న పీస్ట్ వక్కర్లకు ప్రస్తుతం అందుతున్న రూ.20వేలతో పాటుగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రూ.25వేల వేతనం అందనుందన్నారు. దేవాలయాల పాలకమండళ్లలోనూ సభ్యులుగా ఉండాలని మంత్రుతులతో జరిగిన సమీక్షలో చంద్రబాబు నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ విషయం అన్నారు. చట్ట సభల్లో నాయీబ్రాహ్మణులకు ఎమ్మెల్సీ పదవిని ఇవ్వాలని కోరారు. సమావేశంలో టిటిడి మహిళా క్షురకుల వ్యవస్థాపక అధ్యక్షురాలు రాధాదేవి, సుధాకర్, కమల్, తాతారావు, వెంకి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు రుణపడి ఉంటాం: సదాశివం

నాయీబ్రాహ్మణులకు ఏ ప్రభుత్వం చెయ్యని విధంగా ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత సీఎం చంద్రబాబుకు దక్కుతుందని టిడిపి తిరుపతి పార్లమెంటు డివిజన్ బీసీ సెల్ అధ్యక్షులు రుద్రకోటి సదాశివం అన్నారు. బుధవారం ఆయన తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. నాయీబ్రాహ్మణులకు సముచిత స్థానం అందివ్వడంతో పాటుగా దేవాలయాల్లో నాయీబ్రాహ్మణుల వృత్తి చేసే వారికి ఎన్నడూ లేని విదంగా రూ.25వేల వేతనం ఇవ్వడం హర్షించ దగ్గ విషయమన్నారు. సీఎం చంద్రబాబుకు రుణపడి ఉంటామన్నారు. సమావేశంలో విశ్వనాథం, మోహన్, వెంకటరమణబాబు, నరసింహులు పాల్గొన్నారు.

'భారతదేశంతో అంతర్జాతీయ వ్యాపారం శ్రీలంకకు ఎంతో అవసరం'

ప్రజాశక్తి-క్యాంపస్: భారతదేశంతో అంతర్జాతీయ వ్యాపార రంగంలో శ్రీలంకకు ఎంతో అవసరమని, అత్యవశకమని కొలంబో విశ్వ విద్యాలయం, ఆర్థిక శాఖ విభాగం సీనియర్ ఆచార్యులు కే.అమృత లింగం అన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన విభాగం, కేంద్రం, ఎస్వీయూలోని ఆర్థిక గణాంక శాస్త్రం విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సదస్సును బుధవారం సావేరి అతిథి గృహంలో ఘనంగా ప్రారంభించారు. "అంతర్జాతీయ ఆర్థిక సంబంధాలు: (ఎస్డిజి) స్థిరమైన అభివృద్ధి సవాళ్లు" అనే అంశంపై నిర్వహించిన ప్రారంభ సదస్సులో సదస్సు కార్యక్రమానికి కే.అమృత లింగం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ శ్రీలంక అంతర్జాతీయ సంబంధాలలో కరోనా పరిస్థితుల సమయంలో చైనా సహాయం తీసుకోవడంలో విఫలమైందని, అదే సమయంలో భారతదేశ సహాయ సహకారాలు మరువలేమని వెల్లడించారు.

ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్ ప్రారంభం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణ సమీపంలోని బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ ఛార్జింగ్ కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నచిన్న పట్టణాల్లోకి ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్లు అందుబాటులోకి రావడం హర్షించదగ్గ విషయం అన్నారు. పుత్తూరు పట్టణ ప్రజలకు ఛార్జింగ్ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిన కృష్ణం రాజును అభినందించారు. కార్యక్రమంలో నాయకులు మాధవనాయుడు, ధనంజయులు నాయుడు, ఎలుమలై, డాక్టర్ శ్రీధర్ రాజు, శ్రీశైలం మాజీ ఛైర్మన్ చక్రపాణిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇప్పించండి..

ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇప్పించాలని నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్‌కు పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు వినతి పత్రం అందించారు. పుత్తూరు పర్యటనకు విచ్చేసిన సందర్భంగా ఎమ్మెల్యేని కార్మికులు ప్రత్యేకంగా కలిశారు. వేతనాలు సకాలంలో అందక ఇబ్బంది పడుతున్నామని, చొరవ తీసుకొని మంజూరు చేయించాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు శీను, పాల్ రాజ్, సుజాత, శివమ్మ, ఉమా తదితరులు పాల్గొన్నారు.

ఛార్జింగ్ స్టేషన్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే

'భూ సమస్య పరిష్కరించి న్యాయం చేయండి'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఏళ్ళ తరబడి తమ అనుభవంలో ఉన్న భూమిపై నకిలీ పత్రాలను సృష్టించి స్వాధీనం చేసుకొనేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనిపై సంబంధిత అధికారులు విచారించి న్యాయం చేయాలని భాదితుడు ఎం.అశోక్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్లో ఆయన మాట్లాడారు. తన స్వాధీన అనుభవంలో ఉన్న అవిలాల గ్రామ లెక్క దాఖలా సర్వే నెంబర్ 491/1లో 4ఎ.55 సెంట్లు డీకెటి భూమిని సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. అయితే ఆ స్థలాన్ని గతంలో కొందరూ అనేక రూపాల్లో ఆక్రమించుకోవడానికి విఫల యత్నాలు చేసారని అప్పట్లో రెవిన్యూ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్ళి సద్దుమనిగిందన్నారు. ప్రస్తుతం తమ తండ్రీ రమణా రెడ్డి మరణించడంతో ఆయన పేరుపై ఉన్న భూమిని ప్రభుత్వ అధికారులను లోబరుచుకొని కిలారి రామచంద్ర నాయుడు తండ్రీ రాగప్ప నాయుడు ఢీకెటి భూమిని వారిపై అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని భూ పాస్ బుక్ పొందారన్నారు. తద్వారా తమ ఆధీనంలో ఉన్న భూమిలోకి ప్రవేశించి దౌర్జన్యాలతో అడ్డుకుంటున్నారన్నారు. దీంతో న్యాయం కోసం హైకోర్టును ఆశ్రయించడంతో కోర్టు వారు కలెక్టర్ ఈ భూ సమస్యపై విచారణ జరపాలని ఆదేశించారన్నారు. సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు.

ఈ-పంట నమోదుతో అనేక లాభాలు

రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

ప్రజాశక్తి-డక్కిలి: ఈ-పంట నమోదు చేసుకోవడం వల్ల రైతులకు అనేక లాభాలున్నాయని వెంకటగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు యం.నారార్జున సాగర్ తెలిపారు. బుధవారం డక్కిలిలో ఆయన ఈ-పంట నమోదు, కౌలు రైతు కార్డుల పంపిణీ, పంటలలో వస్తున్న చీడ, పీడలు తదితరల అంశాలపై వ్యవసాయ సహాయకులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కౌలు రైతులను, ఆర్ఓఎఫ్ఆర్ పొలాలు సాగు చేస్తున్న రైతులను, ప్రకృతి వ్యవసాయ రైతులను తప్పని సరిగా ఈ-పంటలో నమోదు చేయాలని తెలిపారు. పంటలు నష్టపోయినప్పుడు పంటల నష్టపరిహారం, పంటల భీమా లబ్ది, రాయితీ విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు, బ్యాంకుల నుంచి వడ్డీ లేని రుణాలు, మహిళలకు రైతు కార్డులు అందించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం డక్కిలి ప్రాంతంలో సాగులో ఉన్న పంటలను ఆయన పరిశీలించి సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు.

నేడు వన్ హెల్త్‌పై రాష్ట్రస్థాయి సదస్సు

సదస్సు బ్రౌచర్‌లను ఆవిష్కరిస్తున్న సదస్సు నిర్వాహకులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రపంచ వ్యాప్తంగా మనిషి చుట్టూ ఉన్న వాతావరణం, జంతువుల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా వన్ హెల్త్ అంశంపై గురువారం రాష్ట్రస్థాయి సదస్సును నిర్వహిస్తున్నామని సామాజిక వైద్య విభాగాధిపతి సునీత తెలిపారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్లో ఆమె మాట్లాడారు. ఐఏపిఎస్ఎం, ఐపిహెచ్ఎ సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు సాగే రాష్ట్రస్థాయి సదస్సులో ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచిస్తున్న మానవ మనుగడ, వ్యాదుల నివారణ చర్యలు, జంతువులు, పర్యావరణ పరిరక్షణ అనే అంశాలపై వక్తలు సదస్సుకు వివరిస్తారన్నారు. సమావేశంలో డాక్టర్ రామాంజనేయులు, డాక్టర్ యుగంధర్, వీరకిరణ్ పాల్గొన్నారు.

టీటీడీకి ఆటో క్లినిక్ వాహనం విరాళం

విరాళం అందిస్తున్న దాతలు

ప్రజాశక్తి-తిరుపతి బ్యూరో: చెన్నైకి చెందిన ట్రేటికో ఇంజనీరింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చైర్మన్ కార్తీక్ టీటీడీకి చెందిన లారీ చేసేస్‌కు రూ.8 లక్షల విలువగల బాడి ఫిట్ చేసి బుధవారం ఉదయం తిరుమల శ్రీవారికి విరాళంగా అందించారు. ఈ మేరకు లారీ రికార్డులను తిరుమలలోని శ్రీవారి ఆలయం చెంత టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరికి అందించారు. కార్యక్రమంలో రవాణా విభాగం జిఎం శేషారెడ్డి, డిఐ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మహారాజశ్రీ గూడూరు 7వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

O. S. No. 37 / 2015

1. గౌసున్నీసా బేగం
W/o సలాలుద్దీన్ వగైరా .... వాదులు

V/s

1. క్రిష్ణన్ ప్రశాంత్ S/o క్రిష్ణన్ తంబి
2. షేక్ అబ్దుల్ రషీద్ (Died) వగైరా

....ప్రతివాదులు

దావా నోటీసు

టు, D6)షేక్ హబీబుల్లా S/o లేట్ అబ్దుల్ రషీద్, సాయినగర్, సూళ్ళూరుపేట.
D9) షేక్ హమీదా D/o లేట్ అబ్దుల్ రషీద్, పెద్ద మసీదు వీధి, గూడూరు టౌన్, తిరుపతి జిల్లా.

పై వాదులు మీపై దావా వేసియున్నందున మీకు నోటీసు నిమిత్తం వాయిదా తే.2-09-2024 దీన వేసియున్నారు. కావున ఆ తేదీన ఉదయం 10.30 గం॥లకు మీరు స్వయంగా గానీ, వకీలు గారి ద్వారా గాని, పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనిచో మిమ్మల్ని ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.

ఇట్లు
పి. భాస్కర్ రావు,
వాది తరపు అడ్వకేట్, గూడూరు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా నా క్లయింట్ లేట్ కె.వెంకటప్పయ్య గారి కుమారుడు కొమ్మ వీర వెంకటేశ్వరరావు గారికి రిజిస్ట్రరు విక్రయ దస్తావేజు తేది:09.06.2022 డాక్యుమెంట్ నెం.4653/2022, అరమాటి హరిత గారి వద్ద విక్రయం పొందియున్నారు. సదరు విక్రయ దస్తావేజు తీసుకొని మే నెల 2024న రేణిగుంట బస్టాండు వద్ద దారిపోయినది. సదరు విషయమై రేణిగుంట పోలీసు స్టేషన్ నందు ఫిర్యాదు చేయగా తేది 25.08.2024న నాన్ ట్రేసబుల్ సర్టిఫికేట్‌ను జారీ చేసియున్నారు. సదరు పత్రము ఎవరైనా దొరికిన యెడల యవరికైనా అభ్యంతరము, డిపాజిట్, తగాదాలు వగైరాలు ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన 2 రోజులలోపు ఈ దిగువ తెలిపిన చిరునామాకు వ్రాతపూర్వకంగా తెలియజేయగలరు. అనంతరం వచ్చు అభ్యంతరములు ఆక్షేపణలు పరిశీలించబడవు. పై ఓరిజినల్ దస్తావేజు తెచ్చి ఇచ్చినవారికి తగిన బహుమతి ఇవ్వబడును.

షెడ్యూలు

తిరుపతి జిల్లా, రేణిగుంట సబ్.డి., తిరుపతి రూరల్ మండలం, నెం.11రు తిరుచానూరు గ్రూపు చేరిన తిరుచానూరు గ్రామ పంచాయతీ 9వవార్డుకు చేరిన దామినేడు వార్త టు మోపెడ్స్ రెసిడెన్షియల్ ఏరియాలో నెం.22రు దామినేడు గ్రామ లెక్కదాఖలా సర్కారు పుంజ సర్వే నెం. 75/5రు పూరా విస్తీర్ణము ఎ.0-45 సెంట్లు గల భూమిలో వేసియుండు లేఅవుట్‌లోని ప్లాట్లులో ప్లాటు నెం.2రు గల జాగాలకు హద్దులు కొలతలు వివరములు. తూర్పు:ప్లాటు నెం.3రు గల జాగా, పడమర: ప్లాటు నెం.1రు గల జాగా, ఉత్తరం:33 అడుగుల వెడల్పు గల రోడ్డు, దక్షిణం: యమ్.పద్మావతమ్మ గారు విక్రయించిన భూమి. యీ హద్దుల మధ్యన తూర్పు పడమర : అ.34కు మీ. 10.370ర్లు. ఉత్తరం, దక్షిణం: అ.76.75కస్త్ర ఎతీ. 23.408ర్లు మార్పు 2609.5 చ.అడుగులు లేక 289.94 చ.గజములు గల జాగా పూరా విక్రయం.

ఎ.సురేష్. యల్.యల్.యం. యం.బి.ఎ
అడ్వకేట్, 19-42-యస్.8-620,
రాజారెడ్డి కాలనీ,
యస్.టి.వి.నగర్, తిరుపతి,
సెల్: 9030442579.